# ఆశ ::

రచయిత :
శ్రీ ఖలీలుల్లాఖాన్

"నాయనా! జీవితం సుఖసమన్వితమే గాని దుఃఖభాజనంకాదని నమ్ముతున్నావు నీవు...చాల పొరబడుతున్నావు... నా మాటవిను ఆ ఉద్యోగాన్ని విడచిపెట్టక !"

తల్లి ప్రాధేయపడింది. బ్రతిమాలింది కానీ...యువక రక్తం... తల్లి యొక్క ఆ మందలింపులో యిమిడియున్న ప్రాముఖ్యాన్ని...అరవై సంవత్సరాల అనుభవంతో కూడియున్న ఆ అమరవాక్కుల్ని అనురాగంతో ఆదరించనిస్తుందా ? ఉడుకు రక్తం యువక నాళాలలో శరవేగంతో ప్రవహిస్తున్నంతకాలం మానవుడు నిజంగా అంధుడే అయి ఉంటాడు కాబోలు...!

తనకోరికను నిరాకరించాడు. కానీ భావిజీవితంలో తన కుమారుడు జీవితనౌకను ప్రమాదాలకు గురికాకుండా కాపాడుకో గలడా? ఏమో...? తనకుమాత్రం ఆ నమ్మకంలేదు. ఆ అపనమ్మకంతోనే— ఆ నిరాశతోనే...తన కుమారుని భావిజీవితాన్ని గురించిన మనోవిచారంతోనే ఆ మాతృదేవి యీ లోకాన్ని వదిలివేసింది. తనముద్దుల కుమారుణ్ణి జీవిత రంగంలో యేకాకిగా విడిచిపెట్టి, తాను ప్రక్కకు తప్పుకుంది.

ఏకాకియై...నిరుద్యోగియై—తాను జీవితమనే సుడిగుండంలోపడి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు యువకుడు ఉన్మాదుని మనోప్రవృత్తి తనభావాల్ని పరామర్శిస్తూ ఉన్నట్లు తోంచిందతనికి—! తనస్థితి అప్పటిగ్గాని తనకు అవగాహన కాలేదు. తడిమి చూచుకున్నా...తంటాలు పడ్డాడు. ప్రపంచాన్ని కలయజూచాడు! అంతా శూన్యం. బాధామయం...వాత్సల్యంతో తన్నాదరించేజీవి మరిలేదు...యీ ప్రపంచంలో—! అటువంటప్పుడు ప్రపంచం శూన్యంకాక మరేమిటి తనకు?

'ఆశ' అతని దీనదశకు సానుభూతి చూపించింది. కానీ యెవరా 'ఆశ'? విషాదవాయుతరంగాల తాకితాకిడికి తట్టుకోలేక— గాభరాపడుతున్న నిర్భాగ్య భారతయువతి అని తనకు తెలుసా? తెలిస్తే—మరి ఆ'ఆశ' నిరాశ అయిపోదూ?

ప్రపంచంలో తనలాంటి నిర్భాగ్య జీవులకు సానుభూతిచూపే యింకోజీవి ఉన్నదని ఆనందించాడు. ఆమెవాక్కులలో అతనికి అమరత్వం...ఆమె భావాలలో మధురత...ఆమె నేత్రాలలో తాను కోరేశాంతి ఆమె పవిత్ర హృదయంలో తనకు స్థానం ఉన్నవి (ఉన్నవా?) కానీ తనస్థితి...... సంఘంలో తనుకున్నస్థానం దాదాపు ఒక బిచ్చగాని కున్నంతకంటే యెక్కువ కావేమో...!!

ఏమైతేనేమి? మోడువారిన తన హృదయానికి శాంతి సుధను చిలుకరించే సాధనం ఒకటి దొరికింది...తన దుస్థితిపట్ల

సానుభూతిచూపే జీవి ఒకటున్నది...తన అంధకార జీవితంలో ఒక జ్యోతి...!

"ఆశా! నీ చూపుల్లోని అమాయకత్వం నా బాధల్ని చాలవరకు ఉపశమింపజేస్తూంది. ప్రపంచంలో యేకాకిగా జీవితం గడపటం...అబ్బ...యెంత కష్టం...! నీ పవిత్ర హృదయాలయంలో నాకు శాశ్విత మైన స్థానం దొరికితే...ప్రపంచంలో యింకా యెన్నికష్టాలనైనా సహించగలను. నీ హృదయపీఠంలో నాకొక ప్రత్యేకస్థానం. తప్పకుండా ఉందని భావిస్తున్నాను...

'మధు'హృదయంలో మెదులుతూ ఉన్న యీ భావాన్ని, ఆశయెపుడో గ్రహించింది. మధుయెప్పుడో ఒకప్పుడు తన హృదయ భావను వ్యక్తీకరిస్తాడని 'ఆశ' అంతర్గతమే నిర్ణయించుకుంగి, అదేవిధంగా జరిగింది కూడాను.

క్షమించు మధూ...ఆమె నిటూర్పు విడిచి, వెంటనే మళ్ళీ యిలా అంది "నా నా...నావంటి నీచురాల్ని..." ఆమె పెదవులు వణికాయి. మాటలు తడబడ్డాయి. శరీరం కంపించింది. ఘోరపాతకం చేసిన దానిలా, ఆమెయెందుకో కంగారుపడింది.

మధుకిదేమీ అర్థంకాలేదు. తెల్లబోయి... వెర్రిచూపులుచూస్తూ...ఉన్మాదునిలా, అదోవిధంగా చూచాడు ఆశవైపు "మధూ! నువ్వెరుగవు...నేను వ్య-భి-చా-రి-ణి-ని; భారత మాతకు కళంకాన్ని ఆపాదించే ఘోర వ్యభిచారానికి నేనెపుడో తలవొగ్గేను నాదుర్భర దారిద్ర్యాన్ని జయించటానికి...! నాహృదయంలో నీలాంటి పవిత్ర భారతీయువకునికి స్థానంలేదు కేవలం తుచ్ఛమైన కామాన్ని ఆశించే...పశువులకు తప్ప..."

కాళ్లదగ్గరకువచ్చిన యే జీవనోపాధిని తాను ఒకప్పుడు కాలదన్నాడో...ధిక్కరించాడో...ఆ జీవనోపాధికోసమే ప్రాకులాడి ప్రాకులాడి హతాశుడై...నిరాశతో కుమిలి కృశించిపోసాగేడు. ఏ ఆశ తనదై...తన దుర్భర దారిద్ర్యంలో...అంధకార జీవితంలో తాత్కాలిక శాంతి నైనా ప్రసాదిస్తుందని నమ్మేడో...ఆ'ఆశ' నిరాశఅయిపోయింది.

తన జీవితం యీ విధంగా దుఃఖభాజనమై, దౌర్భాగ్యనిలయమై, కంటకావృత మవటానికికారణం?

మాతృదేవి దీనవదనయై కన్నీరు కారుస్తూఉంది, క్షణక్షణానికి ఆమె ప్రతికృతులు అతని కండ్లకట్టినట్లు కన్పడుతున్నాయి...అతన్ని కుమిలిపోయేట్టుచేస్తున్నాయి. మాతృదేవి తన సందేశాన్ని అతని చెవుల్లో ప్రతిధ్వనింపజేస్తుఉంది.

ఏమిలాభం? పోయిన అవకాశం తిరిగిరాదు. రాలిపోయిన తార తిరిగి గగనమండలాన్ని అలంకరించటం అసంభవం..!